

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

గజ్వేల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధితో పాటు మండల పరిధిలోని పలు రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. రేషన్ దుకాణాల్లో ఉన్న స్టాక్‌కు, రికార్డుల్లో ఉన్న స్టాక్‌ను పోల్చి చూశారు. ప్రజ్ఞాపూర్‌లోని ఓ రేషన్ దుకాణం విజిలెన్స్ అధికారులు వచ్చిన సమయంలో మూసి ఉంచడంతో సీజ్ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ పండరి, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, సివిల్ సప్లయ్ తహసీల్దార్ పద్మాకర్, ఆర్‌ఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



పాలీహౌస్‌లో సాగుచేస్తున్న పంటలు

కూరగాయల సాగుకే మొగ్గు

- వరి కంటే ఆరుతడి పంటలే మేలు
- నూతన పద్ధతులు, మెళకువలతో అధిక లాభాలు
- యాసంగిలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

7



శేఖర్‌రావుపేటలో ఓ రైతు ఏర్పాటు చేసిన పాలీహౌస్

సాగులో క్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి.. జిల్లాలో వరిసాగుతో పాటు రైతులు ఇప్పుడు కూరగాయల పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కూరగాయలు నిత్యావసరం కావడం, మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో రైతులు విభిన్న పద్ధతుల్లో కూరగాయల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్, వెంకటాపూర్, బచ్చాయిపల్లి, పెద్దలింగారెడ్డి పల్లి, నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, మల్యాల, మాటిండ్ల, లక్ష్మీదేవిపల్లి, ఇబ్రహింపూర్ గ్రామాల్లో సాంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలతో పాటు టమాటా, బీర, కాకర, కీర, మిరప, వంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. ఒక్కో రైతు కూరగాయల సాగులో సీజన్‌ను బట్టి సుమారు రూ. 2లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

గుట్టను తవ్వేస్తున్నారు

- 'కొండపోచమ్మ' నుంచి మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు
- పర్యావరణానికి ముప్పు
- ఆలయ మాస్టర్‌ప్లాన్‌లో ఇదే కీలకం
- పట్టింపు లేని అధికారులు

గజ్వేల్/జగదేవ్‌పూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ గుట్ట క్రమంగా సహజ సౌందర్యాన్ని కోల్పోనుంది. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు దర్శనమిస్తున్న ఈ గుట్ట భవిష్యత్ తరాలకు దూరమయ్యేలా కనిపిస్తోంది. కొండపోచమ్మ కొలువై ఉన్న ఈ నల్లరాతి గుట్టలను కొందరు అక్రమార్కులు చెరబడుతున్నారు. ప్రొక్లెయినర్లతో యథేచ్ఛగా పగలు, రాత్రి తేడా లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్‌లోని నల్లరాతి గుట్ట నుంచి మొరం తీస్తున్న ఎక్స్‌కవేటర్

నల్లరాతి గుట్ట

కొమురవెల్లి మల్లన్న చెల్లెలిగా మల్లికార్జునస్వామి దర్శన అనంతరం కొండపోచమ్మను దర్శించుకుంటేనే ముక్తి లభిస్తుందన్న భావనతో ఇక్కడికి భక్తులు వస్తుంటారు. భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతున్న ఈ ఆలయం నల్లరాతి గుట్టలోనే కొలువై ఉంది. అయితే, ఈ గుట్టలోని మట్టిని తరలించి దేవాలయ ప్రాశస్త్యాన్ని దెబ్బతీసేలా దుండగుల చర్యలు ఉన్నాయి. వరంగల్, నల్గొండ, మెదక్ సరిహద్దులో ఈ ఆలయం ఉండగా తెలంగాణ ప్రాంతంలోని భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. తమ కోర్కెలు తీరిన తర్వాత బోనాలు సమర్పించి మొక్కులను చెల్లించుకుంటారు.

మాస్టర్ ప్లాన్‌లో గుట్టల అభివృద్ధి

గత ప్రభుత్వ హయాంలో కొండపోచమ్మ ఆలయానికి సంబంధించి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. 2021 మే 29 కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ అమ్మవారిని దర్శించుకుని, రూ.20కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ మాస్టర్ ప్లాన్‌లో గుట్టను అభివృద్ధి చేసేలా ప్రణాళిక చేశారు. దాదాపు 60 ఎకరాల్లో ఈ నల్లరాతి గుట్ట విస్తరించి ఉంది. ఈ గుట్టకు సంబంధించి పలువురు తమ పట్టా భూమిగా గతంలో అనేకమార్లు దక్కించుకునే ప్రయత్నాలు చేసినప్పటికీ వీలుపడలేదు. మాస్టర్ ప్లాన్ రూపొందించిన సమయంలో తీగుల్ నర్సాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 273లో గల 105 ఎకరాల విస్తీర్ణాన్ని ఆలయ అభివృద్ధి నిమిత్తం నిషేధిత (ప్రోహిబిటెడ్)జాబితాలో పెట్టారు. తాజాగా మట్టిని కొల్లగొట్టి భూమిని దక్కించుకునేందుకు యత్నాలు చేస్తున్నట్లు తీగుల్ నర్సాపూర్, జంగంరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆలయ ప్రాశస్త్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వాపోతున్నారు. అలాగే, పర్యావరణానికి హానీ కలిగే అవకాశం ఉందని, సహజసిద్ధంగా ఏర్పడిన గుట్టను మాయం చేస్తుండడంతో భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు కలుగుతాయోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ తెలిపారు.



తీగుల్ నర్సాపూర్‌లోని కొండపోచమ్మ ఆలయం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

గ్రూప్‌2కు ఏర్పాట్లు

- 37 పరీక్ష కేంద్రాలు
- 13,714 మంది అభ్యర్థులు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం, సోమవారాల్లో జరగనున్న పరీక్షలకు సిద్దిపేట జిల్లావ్యాప్తంగా 13,714 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం 37 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు ఉదయం సెషన్‌లో అభ్యర్థులను 8.30 నుంచి 9.30 నిమిషాల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. రెండవ సెషన్ మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.30 నుంచి 2.30 వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

గ్రూప్2 పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. అవసమైన అధికారులను నియమించామన్నారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో కనీస వసతులు కల్పించామని, అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావొద్దని సూచించారు.

పటిష్ట బందోబస్తు : సీపీ

రెండు రోజుల పాటు జరిగే గ్రూప్2 పరీక్షల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో సీపీ పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. ఇక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని సీపీ అభ్యర్థులకు సూచించారు. హాల్ టికెట్‌లోని సూచనలు చదువుకోవాలని, తమ వెంట ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. బందోబస్తు విషయంలో సిబ్బందికి అధికారులకు ఏవైనా అనుమానాలు, సమస్యలుంటే ఎగ్జామ్స్ పోలీస్ నోడల్ అధికారి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

వరిగడ్డికి యమ డిమాండ్

- పోషకాలు ఉండడంతో రైతుల మొగ్గు
- ఒక్కో కట్టకు సైజ్‌ను బట్టి కూలీ రేటు
- తరలించే వాహనానికి అదనం
- కొంత మొత్తానికి విక్రయిస్తున్న రైతులు, కొందరు ఉచితంగానే ఇస్తున్న వైనం

8

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సిద్దిపేటలోని రంగధాంపల్లి వద్దనున్న విమార్ట్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సింగిల్ యూజుడ్ ప్లాస్టిక్ కవర్లను, పేపర్ ప్లేట్లు, గ్లాసులు ఉండటం గమనించి విమార్ట్ యాజమాన్యానికి రూ. 20వేల జరిమానా విధించారు. పట్టణంలోని వాణిజ్య, విక్రయ, వ్యాపారస్తులు సైతం ప్లాస్టిక్ కవర్లను నిషేధించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఆయన వెంట మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు సతీష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



విమార్ట్ యజమానికి జరిమానా రసీదును అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం సిద్దిపేటలోని సాయితేజ స్లం సమైక్య పరిధిలోని మహేంద్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెకరేషన్ వర్క్స్ దుకాణాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు సాయికృష్ణ, రమ్య, జ్యోతి, ఆర్పీలు సమాఖ్య మహిళ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ లక్ష్యాన్ని చేరుకోవాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగు ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ మను చౌదరి జిల్లాలోని ఆయిల్ ఫెడ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లాలో ఇప్పటి వరకు 12,200 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతుందని ఉద్యాన వన శాఖ అధికారి సువర్ణ తెలిపారు. 2024-25లో 4000 ఎకరాల లక్ష్యం పెట్టుకోగా, ఈ సంవత్సరం 1817 ఎకరాలు డీడీలు చెల్లించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1020 ఎకరాల్లో మొక్కలు పెట్టడం పూర్తయినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని, ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి ఆయిల్ పామ్ వల్ల కలిగే లాభాలు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగు గురించి పెద్దఎత్తున ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో వంద శాతం పూర్తి లక్ష్యాన్ని చేరేవిధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, వ్యవసాయశాఖ అధికారి రాధిక పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కొండెక్కిన కోడిగుడ్డు

- క్రిస్మస్, న్యూ ఇయర్ ఎఫెక్ట్
- రిటైల్‌లో రూ.7 నుంచి రూ.8 చొప్పున విక్రయం
- సామాన్యులపై భారం





అక్కన్నపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయల దారిలోనే కోడిగుడ్డు ధరలు కూడా కొండెక్కుతున్నాయి. పెరిగిన ధరల వల్ల డజన్ కోడి గుడ్లను కొనే వారు అరడజనుకే పరిమితమవుతున్నారు. హోల్‌సెల్ మార్కెట్‌లో వారం క్రితం ఒక ట్రే ధర రూ.180 ఉండగా ప్రస్తుతం డిమాండ్‌ను బట్టి రూ.190 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.6.33 నుంచి రూ.6.66 చొప్పున అమ్ముతున్నారు. రిటైల్ వ్యాపారులు రూ.7 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. మాంసాహారానికి దూరంగా ఉండే కార్తీక మాసం ముగియడంతో కోడిగుడ్ల వినియోగం పెరిగింది. నిత్యం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కోడిగుడ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. అలాగే ఈ నెలలోనే క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలు జరుపుకోనున్నారు. ఈ వేడుకలకు కేక్‌లను ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. కేక్‌ల తయారీలో కూడా కోడిగుడ్లను వినియోగిస్తుండడంతో డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. రానున్న రోజుల్లో కోడిగుడ్డు ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు.



వందేళ్లయినా.. వన్నె తగ్గలే

- శతాబ్ది వేడుకలకు మెదక్ చర్చి ముస్తాబు
- వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యుల ఏర్పాట్లు
- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, చార్లెస్ వాకర్ కుటుంబసభ్యులు

7

'చేర్యాల' డివిజన్ ఏర్పాటుకు అడుగులు

- సమాచార సేకరణ లేఖలో తప్పులు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వార్‌కు మరింత ఆజ్యం

చేర్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం సిద్దిపేట జిల్లా అధికారులకు పంపిన లేఖలో తప్పులు దొర్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ప్రభుత్వ కార్యాలయాల సేవల విషయంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని 2022లో అప్పటి భువనగిరి ఎంపీ, ప్రస్తుత రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ఒకరోజు దీక్ష చేపట్టారు. అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన లేఖ మేరకు అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ స్పందించి నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కానీ ఎలాంటి పురోగతి కనపడలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఫిబ్రవరి 16న కూడా మంత్రి పొంగులేటిని కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం కావడంతో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం తనయుడు నాగపురి కిరణ్‌కుమార్ కూడా మంత్రులకు, ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంపీగా కొనసాగిన సమయంలో అందించిన వినతితో పాటు 2024లో ఎమ్మెల్యే పల్లా ఇచ్చిన వినతుల విషయాన్ని ప్రస్తావిస్తూ మెమో నెం.8517/డీఏ/ 2022-2, తేదీ 21-11-2022 పేరిట సీసీఎల్ఏతో పాటు జిల్లా అధికారులకు లేఖ పంపించారు. అలాగే గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో కొనసాగుతున్న నాలుగు మండలాల పరిస్థితుల సమాచారాన్ని అందించాలని సూచించారు. లేఖలో 2022 సంవత్సరం పొందుపరచడం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. కొమ్మూరి వినతి వల్లే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కాబోతుందని కాంగ్రెస్ శ్రేణులు, ఎమ్మెల్యే పల్లా లేఖతోనే కదలిక వచ్చిందని బీఆర్ఎస్ శ్రేణులు ఎవరికి వారు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇప్పటికే ప్రొటోకాల్ విషయంలో ఇరుపార్టీల మధ్య రభస కొనసాగుతుండగా లేఖ అంశం ఆజ్యం పోసినట్లయింది. ఈవిషయమై సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌ను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి వచ్చిన లేఖానుసారం గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేట డివిజన్ అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్నామని, నివేదికకు ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.

132 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 132 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొల్లూరు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కొల్లూరు మీదుగా నగరం నుంచి అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారన్న విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎస్‌ఐ రమేశ్ అవుటర్ రింగ్ రోడ్డుపై కాపుకాచి బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యాన్ని పటాన్‌చెరు సివిల్ సప్లై అధికారిణి తేజశ్వినికి అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగకు రిమాండ్


నిందితుడు మహ్మద్ హమీద్

రామచంద్రాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ జగన్నాథ్ కథనం ప్రకారం... ఈ నెల 8న రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌కాలనీలో రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణా రావు ఇంట్లో 46 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.13 వేలు చోరీకి గురైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా గురువారం రాత్రి నిందితుడిని రామచంద్రాపురంలో అదుపులోకి తీసుకుని విచారించగా అతని పేరు మహ్మద్ హమీద్(20) మెహదీపట్నంలో నివాసముంటున్నట్లు చెప్పాడు. సాయినగర్ దొంగతనంతో పాటు గతంలో నేరెడ్‌మెట్, కుషాయిగూడ, దోమలగూడలో 2, రామచంద్రాపురంలో 2, సంజీవరెడ్డినగర్, కూకట్‌పల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేసినట్టు నిందితుడు అంగీకరించాడు. అతడి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు.

బాలమేళాతో సృజనాత్మకత వెలుగులోకి..

● జిల్లా సంక్షేమ అధికారి హైమావతి


బాలమేళాలో మాట్లాడుతున్న హైమావతి

శివ్వంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలమేళా కార్యక్రమంతో బాలల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే అవకాశం ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, సీడీపీవో హేమాభార్గవి అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, వసుమతి ఆధ్వర్యంలో దాతలు భవనగారి శీను, వడ్ల శ్రీకాంత్, అంజి సహకారంతో శుక్రవారం బాలమేళా నిర్వహించారు. హైమావతి, హేమభార్గవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ మేళాలో పిల్లలు మట్టి పాత్రలు, స్టోరీ థియేటర్, పప్పీ హౌస్‌తోపాటు ప్రకృతిసిద్ధంగా సేకరించిన వస్తువులను ప్రదర్శనకు ఉంచగా.. వారు సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కృషి గ్రామీణ విజ్ఞాన సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతరావు, భవనగారి శీను, శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రూప్లాతండాలో వైద్య శిబిరం

శివ్వంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీబీ ప్రచార దినోత్సవంలో భాగంగా శుక్రవారం రత్నాపూర్ ఉపకేంద్రం పరిధిలోని రూప్లాతండా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న 112 మంది వలస కార్మికులకు హెల్త్ క్యాంపులో ఎక్స్‌రేతో పాటు 8 మందికి సీబీఎన్ఏఏటీ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వైద్యాధికారి సాయి సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేశ్వరి, సృజన, ఎంపీహెచ్ఈవో మహేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-2కు భారీ బందోబస్తు

● 200 మంది పోలీసులతో భద్రతా చర్యలు
● పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు
● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15, 16వ తేదీల్లో గ్రూప్-2 పరీక్షలకు జిల్లాలో 200 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నటుల మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-2 పరీక్షలకు జిల్లాలో మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఆయా కేంద్రాల వద్ద సెక్షన్ 163 యాక్ట్ (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందన్నారు. రెండు రోజులు పాటు ఆంక్షలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఐదుగురికి మించి గుంపులుగా ఉ ండరాదన్నారు. సభలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపు, ధర్నాలు, ప్రచారాల వంటి నిర్వహించరాదన్నారు. పరీక్ష సమయంలో పరిసరాల్లో ఇంటర్నెట్, జిరాక్స్, స్టేషనరీ షాపులు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గంటన్నర ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరీక్షించాకే లోపలకు పంపుతామన్నారు. నిమిషం ఆలస్యమైన లోనికి ఎవరినీ అనుమతించమని ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో రమాదేవి

మెదక్ పట్టణంలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించే పరీక్షా కేంద్రాలను శుక్రవారం మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్‌లో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

తూప్రాన్‌లోనూ..

తూప్రాన్, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను శుక్రవారం తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి పరిశీలించారు. తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య హైస్కూల్‌లలో గ్రూపు-2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రంలో 288 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు వివరించారు.

'వజ్రా' సేవలు వినియోగించుకోవాలి

● సంగారెడ్డి ఎస్పీ రూపేష్


పోలీసులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాంబు డిస్పోజబుల్ బృందంలో విధులు నిర్వర్తించే సిబ్బంది అన్ని రకాల సెక్యూరిటీ విధుల గురించి తెలుసుకోవాలని, ముఖ్యంగా వజ్ర వాహనాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ రూపేష్ సూచించారు. సంగారెడ్డిలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కొత్తగా నియామకమైన ఏఆర్ సిబ్బందితో బాంబు డిస్పోజబుల్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధుల గురించి తెలుసుకోవాలన్నారు. వీఐపీల కార్యక్రమాలు ఉన్న సమయంలో ముందుగా బాంబు డిస్పోజబుల్ టీం వీఐపీలు వెళ్లే మార్గాన్ని, ప్రసంగించాల్సిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా వజ్ర వాహనాన్ని ఎలాంటి సందర్భంలో వినియోగించాలి, వజ్ర వాహనాన్ని ఉపయోగించి స్మోక్, రబ్బర్ బుల్లెట్లతో ఏ విధంగా ఫైర్ చేయాలనే స్వయంగా ఫైర్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రామారావు, డానియల్, మురళీదర్, నారాయణరావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

● మంత్రులకు వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దుర్తి/హత్నూర డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి.. వారిని క్రమబద్ధీకరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికేల వెంకటేశం అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా వెట్టిచాకిరీ గురవుతూ విద్యావ్యవస్థను ఎంతో ప్రభావితం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోసం చేస్తున్న నిరవధిక సమ్మె వల్ల విద్యావ్యవస్థ కాంప్లెక్స్ నుంచి జిల్లా స్థాయి వరకు కుంటుపడిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులకు తక్షణమే పేస్కేల్‌ను అమలుచేయాలని కోరారు. స్పందించిన మంత్రులు సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదన్‌రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, డీపీవో వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్‌లో సృజనాత్మక సదస్సు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో విద్యార్థుల సృజనాత్మక సదస్సు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు అందమైన చిత్రాలతో కనువిందు చేసే ప్రాజక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంథోనీస్ విద్యాసంస్థల చైర్మన్ అంథోనిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ మనసులోని భావాలను చక్కగా వ్యక్తం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అడ్వైజర్ రూబెన్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి, లీడ్ అకాడమిక్ ఎక్స్‌లెంట్ మేనేజర్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సృజనాత్మక సదస్సులో పాల్గొన్న చిన్నారులు

వందేళ్లయినా.. వన్నె తగ్గలే

- శతాబ్ది వేడుకలకు మెదక్ చర్చి ముస్తాబు
- నిర్మాణంలో దేనికదే ప్రత్యేకత
- వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యుల ఏర్పాట్లు
- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, చార్లెస్ వాకర్ కుటుంబ సభ్యులు

మెదక్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి వందేళ్లను పూర్తిచేసుకున్నది. రాళ్లు, డంగు సున్నంతో నిర్మించిన ఈ కళాత్మక కట్టడం వలన నేటికీ చెక్కుచెదరకుండా.. ఏ మాత్రం వన్నె తగ్గకుండా తళతళలాడుతున్నది. వందేళ్లకు పూర్వం ఇంగ్లాండ్ నుంచి వచ్చిన పాస్నెట్ ఇక్కడ ఆకలితో అలమటిస్తున్న ప్రజలను చూసి, వారి ఆకలిని తీర్చాలనే ఉద్దేశంతో పనికి ఆహారపథకంలో భాగంగా ఈ చర్చి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుదీర్ఘకాలం పాటు నిర్మాణం కొనసాగగా, పనులు మొదలైన నాటి నుంచి పదేళ్లకు కరుణామయుడి ప్రార్థనలకు అందుబాటులోకి వచ్చింది. ఆసియాలోనే అతిపెద్ద ప్రార్థనా మందిరంగా పేరుగాంచింది.

అద్భుత కట్టడం

మెదక్ చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ పాస్నెట్. ఆయన ఇంగ్లాండ్ దేశస్థుడు. ఇంగ్లాండ్‌లోని షఫిల్డు నగరానికి చెందిన పాస్నెట్ మెథడిస్టు సంఘంలో పాస్టర్‌గా అభిషేకం పొంది క్రైస్తవ మత ప్రచారం కోసం 1895లో ఇండియాకు వచ్చారు. సికింద్రాబాద్ తిరుమలగిరిలోని గ్యారిస్టర్ చర్చిలో పాస్టర్‌గా నియమితుడయ్యాక కొన్నాళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతంలో సువార్త సేవలందించాలని నిర్ణయించుకున్నాడు. 1897లో ఆయన హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న మెదక్ పట్టణంలోని చర్చికి పంపించారు. ఆ సమయంలో మిషన్ కాంపౌండ్‌లోని రెండంతస్థుల భవనంలో నివాసం ఉండే పాస్నెట్ తన నివాసం కంటే చర్చి చిన్నగా ఉండటాన్ని గమనించారు. అది నచ్చక ఏసుక్రీస్తుకు పెద్ద చర్చి నిర్మించాలని తలచి ఈ మహాదేవాలయ నిర్మాణానికి పూనుకున్నారు. నాడు కరువుఛాయలతో అల్లాడుతున్న మెదక్ ప్రాంతంలో ఆకలితో అలమటించడాన్ని గమనించిన ఆయన చర్చి నిర్మాణంతో బీదలకు పని కల్పించారు. అలా 1914లో ప్రారంభమైన చర్చి నిర్మాణం పదేళ్ల పాటు కొనసాగి 1924లో పూర్తయింది. దేవుడికి గుడి నిర్మించాలన్న తన సంకల్పాన్ని నెరవేర్చుకోవడంతోపాటు తీవ్రమైన కరువు నెలకొన్న సమయంలో వేలాది మంది పనికి ఆహారం ద్వారా పేదలకు పనికల్పించి వారి కడుపునింపారు.

విశాలమైన నిర్మాణం

174 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పు, 200 అడుగుల పొడవుతో విశాలంగా నిర్మించిన మెదక్ చర్చి కళాత్మక కట్టడంగా పేరుగాంచింది. దీనికి ఇంగ్లాండ్ ఇంజనీర్ బ్రాడ్‌షా దాదాపు 200 నమూనాలు రూపొందించి అందులో ప్రస్తుత చర్చి నమూనాను ఎంపిక చేయడం విశేషం. వాస్తు శిల్పి థామస్ ఎడ్వర్డ్ సూచనలకు అనుగుణంగా నిర్మించారు. దేశ, విదేశీ నిర్మాణ రంగ నిపుణుల పర్యవేక్షణలో యూరప్ గోతిక్ శైలిలో చర్చి రూపుదిద్దుకుంది. చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం ఒకే సారి 5000 మంది వరకు ప్రార్థన చేయవచ్చు.

దేశ విదేశాల నుంచి భక్తుల రాక

మెదక్ చర్చికి తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రతీ ఆదివారం మహాలయంలో పెద్దఎత్తున నిర్వహించే ప్రార్థనలకు దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తూనే ఉంటారు. ప్రతీ ఏటా క్రిస్మస్ వేడుకలకు ఈ చర్చికి లక్షలాది భక్తులు తరలివస్తారు. మెదక్‌లో జాతీయ రహదారి 44పై హైదరాబాద్‌కు 90 కిలోమీటర్ల దూరంలో ఈ చర్చి ఉన్నది.



శతాబ్ది ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

ప్రపంచంలోనే అత్యుత్తమ కట్టడాల్లో ఒకటైన మెదక్ సీఎస్ఐ చర్చిని కట్టి డిసెంబర్ 25తో వంద సంవత్సరాలు పూర్తి కానుంది. ఈసారి క్రిస్మస్ సంబురాలను వైభవంగా నిర్వహించేందుకు చర్చి ప్రెసిబేటరీ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణంగా క్రిస్మస్ వేడుకల్లో లక్షలాదిగా జనం పాల్గొంటారు. ఆరోజు భక్తులకు ఇబ్బంది కలగకుండా 23న శతాబ్ది ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్టు చర్చి నిర్వాహకులు తెలిపారు. 23న 15 మంది బిషప్‌లతో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ పాస్నెట్ కుటుంబ సభ్యులను ప్రెసిబేటరీ కమిటీ ఆహ్వానించింది.

భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి కార్యక్రమాలు

భక్తులకు ఎలాంటి అవంతరాలు ఎదురవకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం. ఈ సంవత్సరంతో చర్చి కట్టడానికి 100 ఏళ్లు నిండిన సందర్భంగా పలు కార్యక్రమాలను చేపడుతున్నాం. ఈ సారి రాష్ట్ర ముఖ్యమంత్రి రానుండడం శుభపరిణామం. చర్చి నిర్మాణం చేసిన చార్లెస్ వాకర్ పాస్నెట్ కుటుంబ సభ్యులు కూడా వచ్చే అవకాశం ఉంది. అంగరంగా వైభవంగా వేడుకలు జరుపడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– గంట సంపత్, చర్చి కమిటీ కోశాధికారి

..లేదంటే కారుణ్య మరణాన్ని ప్రసాదించండి

- సహారా బాధితుల ఆందోళన
- కోహెడ్ నుంచి హుస్నాబాద్‌కు పాదయాత్ర



కోహెడలో ఆందోళన చేస్తున్న సహారా బాధితులు

కోహెడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సహారా ఇండియా ఖాతాదారులకు డిపాజిట్ చేసిన సొమ్మును వెంటనే తిరిగి చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఆందోళన చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కోహెడ నుంచి హుస్నాబాద్ వరకు పాదయాత్ర ప్రారంభించారు. 'మా ప్రాణాలైనా కాపాడాలని లేకుంటే.. కారుణ్య మరణాన్ని ప్రసాదించాలని' బ్యానర్ చేత పట్టుకొని పాదయాత్ర చేపట్టారు. కోహెడ మండల కేంద్రంలో వాడవాడల తిరుగుతూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. సహార సంస్థ పైన ఉన్న నిషేధాన్ని కొనసాగించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు సీఆర్‌సీఎస్ ద్వారా చేపట్టే చెల్లింపులు బ్యాంకుల ద్వారా చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు వడ్డీతో బాధితులకు వారి డిపాజిట్ సొమ్మును చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు పట్టించుకునే నాథుడే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సహారా సంస్థలో ఉన్న బాధితులకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 20 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టి రాత్రి 7 గంటల వరకు పాదయాత్ర హుస్నాబాద్‌కు చేరుకుంది. కార్యక్రమంలో బాధితులు పూజిత మిశ్రా, బాలరాజు, బాలయ్య అరుణ, అమీనా, మంజుల, పద్మావతి, లావణ్య, విజయ, వనజ, రామలింగం, నరేష్, వివిధ జిల్లా నుండి వచ్చిన బాధితులు పాల్గొన్నారు. శనివారం హుస్నాబాద్ నుంచి హనుమకొండ జిల్లా ముల్కనూరు వరకు ఈ పాదయాత్ర జరుగుతుందని, ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని పూజిత మిత్ర తెలిపారు.



ఎన్ని చక్రాలో..

పాపన్నపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెట్రోలియం గ్యాస్ నిల్వచేసే పెద్ద యంత్రాన్ని తీసుకొని హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి 74 చక్రాలున్న భారీ వాహనం బయలుదేరింది. ఈ వాహనం మెదక్-బొడ్మట్‌పల్లి ప్రధాన రోడ్డుపై శుక్రవారం ప్రయాణించడంతో వాహనదారులు ఆసక్తిగా తిలకించారు.

రూ.3 లక్షలకు తేలని లెక్క..

- కల్హేర్‌లో ఈజీఎస్ ప్రజాదర్బార్
- రూ.96 వేలు దుర్వినియోగం



కల్హేర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

కల్హేర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కల్హేర్ మండలంలో చేపట్టిన ఈజీఎస్ పనులకు సంబంధించి ఎంపీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 26 గ్రామ పంచాయితీల్లో ఈ నెల 2 నుంచి 12 వరకు డీఆర్పీలు సామాజిక తనిఖీకి నిర్వహించారు. ఈ వివరాలను ప్రజాదర్బార్‌లో గ్రామ పంచాయితీల వారీగా చదివి వినిపించారు. మొత్తానికి రూ.96 వేలు దుర్వినియోగం చేసినట్లు తేలగా రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే లెక్కలు తేలని రూ.3 లక్షలకు సంబంధించిన వివరాలు సమర్పించాలని ఫీల్డు అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేసినట్లు డీఆర్డీఏ అదనపు పీడీ బాల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఈజీఎస్ సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ మహేష్, ఎంపీడీవో రమేష్‌బాబు, ఏపీవో శ్యాంకుమార్, ఈసీ వేణుమాధవ్, టీఏలు శ్రీనివాస్ రెడ్డి, బన్సీలాల్, తులసీరామ్, శివశంకర్, గ్రామ పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఎప్డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ పరిసర ప్రాంతంలో టీఎస్ఐఐసీ కోసం భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎప్డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వర్గల్ మండలం అవుసులోనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని టీఎస్ఐఐసీ భూముల వద్ద రైతులకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు విడతల వారిగి రైతుల నుంచి పరిశ్రమల ఏర్పాటు కోసం టీఎస్ఐఐసీ ద్వారా 1150 ఎకరాలు భూములు సేకరించిందన్నారు. అప్పటి కలెక్టర్ వెంకట్రామరెడ్డి టీఎస్ఐఐసీ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10 లక్షలతో పాటు 250 చదరపు గజాల ప్లాటు ఇచ్చారన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు పొన్నం ప్రభాకర్, జీవన్‌రెడ్డి, కొదండరాం, రాజనర్సింహ రైతుల వద్దకు వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎకరాకు రూ. 50లక్షలు, ఇంట్లో ఎందరు ఉంటే అందరికి ప్లాట్లు ఇస్తామని టీఎస్ఐఐసీ భూముల వద్ద టెంట్లు వేసి మరీ దీక్ష చేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి ఉందని అప్పుడిచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అదేవిధంగా పరిశ్రమలు కేటాయించిన భూముల్లో ఇటీవల కొందరు నాయకులు టెంట్లు వేయించి రైతులతో ఆందోళన చేయించారన్నారు. రూ.3 లక్షలు ఇప్పిస్తామని రైతులకు బాండ్ పెపర్ రాసిచ్చి ఆందోళన విరమింపజేశారని, తీరా ఇప్పుడు లక్ష ఇస్తామనడం సరికాదన్నారు. రైతులకు న్యాయం చేయ్యాలని లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



బాధిత రైతులకు మద్దతు తెలుపుతూ నినాదాలు చేస్తున్న ఎప్డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కూరగాయల సాగుకే మొగ్గు..

- వరి కంటే ఆరుతడి పంటలే మేలు
- నూతన పద్ధతులు, మెళకువలతో అధిక లాభాలు
- యాసంగిలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం



డ్రిప్‌తో సాగు చేసిన మిర్చి పంట

సిద్దిపేట రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో సిద్దిపేట రూరల్ మండల రైతులు ఆ దిశగా పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగు చేపడుతూ మంచి లాభాలు పొందుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. తీగజాతికి సంబంధించిన బీర, కాకర, బోడ కాకర, సోరకాయ వంటి పంటలను పందిరి, లేదా పాలీహౌజ్‌లు ఏర్పాటు చేసి సేంద్రియ ఎరువుల వినియోగంతో సాగు చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు 4 లేదా 5 గుంటల విస్తీర్ణంలో పాలీహౌజ్‌లు ఏర్పాటు చేసుకుని కీర, టమాట, కొత్తిమీర, ఇతర ఆకు కూరలు పండిస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్, వెంకటాపూర్, బచ్చాయిపల్లి, పెద్దలింగారెడ్డిపల్లి, నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, మల్యాల, మాటిండ్ల, లక్ష్మీదేవిపల్లి, ఇబ్రహింపూర్ గ్రామాల్లో వరి, మక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలతో కూరగాయలు పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో దాదాపుగా 300లకు పైగా ఎకరాల్లో పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు సాగవుతున్నాయి. యాసంగిలో కూరగాయల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

సేంద్రియ సాగుకు ఎక్కువ డిమాండ్..

రోజూ నిద్ర లేచింది మొదలు మానవులు తమ దైనందిన జీవితంలో తీసుకునే ప్రతీ ఆహారం రసాయన ఎరువులతో తయారైనవే కావడంతో ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలకు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నది. దీంతో రైతులు సైతం సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగుపై దృష్టి సారించారు. యువ రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని కూరగాయల పంటల సాగులో విజయం సాధిస్తున్నారు.

పాలీహౌజ్‌లతో పంటకు చీడపీడల బెడద ఉండదు...



కూరగాయల సాగు మంచి లాభాలు గడించవచ్చు. ఇది ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటునిస్తుంది. ఐదు గుంటల్లో పాలీహౌజ్ ఏర్పాటు చేసుకుని టమోటా, కీర, ఆకు కూరలు సాగు చేశాను. పాలీహౌజ్ వల్ల వాతావరణంలో మార్పులు వచ్చినప్పటికీ ఆరోగ్యకరమైన పంట దిగుబడి వచ్చింది. చీడపీడల బెడద కూడదు ఉండదు.

-దండవేణి సుమన్, యువరైతు, మాటిండ్ల

కూరగాయల సాగుతో ప్రతి రోజూ ఆదాయం..



ఫోటో13ఎస్ఐడి157; నాంపల్లి ప్రశాంత్, యువరైతు, శేఖర్ రావుపేట

నాకున్న కొంత భూమిలో మిర్చి, కాకర, ఆకు కూరలు, ఉల్లి, వెల్లుల్లి వంటి పంటలు సాగు చేస్తున్నా. నీటి వసతి తక్కువగా ఉండడంతో మిర్చి పంటకు డ్రిప్ ఏర్పాటు చేసాను. ఖాళీ స్థలంలో ఆకుకూరలు, మిర్చి పంట చుట్టూ కాకర సాగు చేశాను. కూరగాయలతో నిత్యం ఆదాయం ఉంటుంది.

-నాంపల్లి ప్రశాంత్, యువరైతు, శేఖర్ రావుపేట

క్రైం కార్నర్

వాహనం ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు



అరుణ్(ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట మండల కేంద్రానికి చెందిన ఇసుగారి అరుణ్ (19), మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన కొలనుపాక (నర్సగోని) శ్రీనివాస్‌గౌడ్, పాలాట గ్రామానికి చెందిన నీలం మహేందర్ గురువారం తూప్రాన్‌లో స్నేహితుడి జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. అనంతరం గురువారం రాత్రి ముగ్గురు ద్విచక్రవాహనంపై తిరగి వెళ్తుండగా మున్సిపల్ కార్యాలయం వద్ద యూ టర్న్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్ గాయపడ్డారు ఇరువురిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గృహిణి..



అనిత(ఫైల్)

నర్సాపూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గృహిణి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఐ-2 శ్రీనివాస్ కథనం ప్రకారం నర్సాపూర్ మండలం ఎర్రకుంటతండా పంచాయతీ బాల్యా తండాకు చెందిన హలవత్ అనిత(27), శ్రీనివాస్ దంపతులు గురువారం రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేశాక పడుకునే సమయంలో టీ తాగుదామని అనిత వంటింట్లో వెళ్లింది. అక్కడున్న స్టీలు స్టాండ్‌లో గ్లాసు తీసే క్రమంలో అప్పటికే తేలిన విద్యుత్ తీగ దానికి తగిలి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నర్సింహులు (ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పల్లపు వడ్డె నర్సింహులు (48) రాయి కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లీడుకొచ్చిన కూతురు ఉండడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గురువారం సాయంత్రం ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కాసేపటికి సోదరుడు పల్లపు అశోక్‌కు ఫోన్ చేసి తన కూతురును జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. అనంతరం ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడం, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, శుక్రవారం మల్కాపూర్ శివారు అటవీ ప్రాంతంలో పల్లపు నర్సింహులు ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు..

మిరుదొడ్డి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల గ్రామానికి చెందిన బెస్త గొల్లనర్సయ్య కుమారుడు బెస్త గొల్లస్వామి స్థానిక డబుల్‌బెడ్రూం ఇండ్లలో నివాసం ఉంటున్నాడు, ఆయనకు భార్య, కూతురు ఉండగా, వ్యవసాయ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లుగా అప్పుల బాధతో మానసిక వేదనతో గురవుతున్నాడు. దీంతో శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రథమ చికిత్స అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

మద్దూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ మద్దూరు మండలం లద్నూరులోని అత్తగారింటికి వచ్చాడు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆధార్‌కార్డు సబ్‌మిట్ చేయడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. లద్నూరు డ్యాం సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద వెల్దండ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో ప్రభాకర్ ప్రమాదవశాత్తు ఆ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అతని ఎడమకాలు పాదంపైన శీల మండలం భాగం విరిగింది. అతడిని 108లో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ ఈఎంటీ వెంకట్, పైలట్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ

హుస్నాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డులో ఓ వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెలతాడు చోరీ చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బొడ్డుల లక్ష్మి వైద్యం కోసం హుస్నాబాద్‌కు వచ్చింది. ఆసుపత్రిలో చూపించుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా నాగారం రోడ్డులోని బస్టాండ్ వెనకాల సిమెంట్ దుకాణం ఎదుట ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. నిన్న ఇక్కడ దాడి జరిగిందని, నీ మెడలో ఉన్న పుస్తెలతాడును టవల్‌లో దాచిపెడదాం అని చెప్పి బంగారాన్ని తీసుకొని టవల్‌లో రాళ్లు పెట్టి ఇచ్చి పరుగులు పెట్టారు. దీంతో అనుమానం వచ్చిన లక్ష్మి అరవడంతో జనం గుమ్మిగూడారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలు నుంచి వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాలు చెక్ చేసి అనుమానితుల ఫొటోలను సేకరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ

చిన్నశంకరంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని ధర్పల్లి గ్రామ హైస్కూల్‌లో శుక్రవారం మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. స్పీకర్‌గా అఖిల, ముఖ్యమంత్రిగా వైష్ణవి, ఉపముఖ్యమంత్రిగా సంజన, మంత్రులుగా దుర్గా, మహేష్, స్వాతి, శ్రావ్య, వినయ్, ప్రతిపక్షనేతలుగా దుర్గా, లావణ్య, పూజ, వైష్ణవి వ్యవహరించారు. అసెంబ్లీ సమావేశాల మాదిరిగా అభివృద్ధిపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంతోష, బృందం తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లి హైస్కూల్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వరిగడ్డికి యమ డిమాండ్

- పోషకాల ఉండటంతో రైతుల మొగ్గు
- ఒక్కో కట్టకు సైజ్‌ను బట్టి కూలీ రేటు
- తరలించే వాహనానికి అదనం
- కొంత మొత్తానికి విక్రయిస్తున్న రైతులు, కొందరు ఉచితంగానే ఇస్తున్న వైనం



ధర్మారం పొలంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న వరిగడ్డి కట్టలు

మద్దూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పశువులకు తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉన్న ఆహారాన్ని అందించి పశు పోషణలో మెళుకవలు పాటించి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. పశువులకు పుష్టికరమైన మేపును అందించేందుకు రైతులు పశుగ్రాసంతో పాటు సమీకృత దాణా సమకూర్చుకోవడానికి సమాయత్తం అవుతున్నారు. మద్దూరు ఉమ్మడి మండలంలో 21350 ఎకరాల్లో సుమారు 13360 మంది రైతులు వరి సాగు చేశారు. మండలంలో సుమారు 12 వేలకు పైగా పశువులున్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. పోషకాలతో కూడిన వరిగడ్డితో దేశవాళీ గేదెల్లో ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. రోజూ వారి ఆహార అవసరాలకు వరి కోతల అనంతరం రైతులు వరి గడ్డిని కట్టలు కట్టిస్తూ వాములు ఏర్పాటు చేసుకుంటున్నారు. పశువు వయస్సును బట్టి రోజుకు కనీసం 5 కేజీల మేతతో పాటు వాటికి పెట్టే దాణా మోతాదును తగ్గించుకుంటూ మేతను ఆహారంగా అందిస్తూ వస్తున్నారు. పశు మేతలో ఒక్కసారిగా మార్పు చేయరాదని, అలా చేస్తే పాల ఉత్పత్తి తగ్గిపోయే ప్రమాదముందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. కొంతమంది రైతులు వరి గడ్డిని ఉచితంగా ఇస్తుండగా మరి కొంతమంది రైతులు విక్రయిస్తుండటంతో పశుపోషకులు ముందస్తుగా వరిగడ్డిని కొనుగోలు చేస్తూ తిరిగి వరి కోతలు వచ్చే వరకు వాములుగా పేర్చుకుంటున్నారు.

అడుక్కున్నా.. కొనుక్కున్నట్టుగానే ఉంది

లక్కపల్లిలో రైతును బతిమిలాడుకుని వరి గడ్డి తీసుకున్నా కొనుక్కున్నట్టుగానే ఉంది. రోలర్‌తో ఒక్కో కట్ట కట్టించుకున్నందుకు చిన్నదైతే రూ.30, పెద్ద కట్ట అయితే రూ. 40 తీసుకుంటున్నారు. ట్రాలీ వాహనంలో ఎక్కించినందుకు రూ.600 కూలీతో పాటు ట్రాలీ కిరాయి మలకకు రూ.400 చొప్పున చెల్లించాను. 40 కట్టలు తీసుకుపోయాను.

- బైరి జగత్, రైతు, మద్దూరు

9 పశువులకు సరిపడా గడ్డిని నిల్వ చేశా

నాకు రెండు ఎకరాల భూమి ఉంది. దాంట్లో వరి సాగు చేశా. వరి కోతల అనంతరం రోలర్‌తో 83 కట్టలు కట్టించా. ఒక్కో కట్టకు రూ.30లు చెల్లించాను. తిరిగి వరి కోతల వరకు పశువులకు మేతకు ఇబ్బందులు లేకుండా వాము ఏర్పాటు చేసుకున్నా. వర్షాలకు పాడవకుండా ముందుస్తు జాగ్రత్తగా వరిగడ్డిని కప్పి ఉంచేందుకు టార్పాలిన్ తెచ్చిపెట్టుకున్నా.

- జక్కుల ఎల్లయ్య, రైతు, ధర్మారం

న్యూస్ బాక్స్

హుండీలో పడిన సెల్‌ఫోన్ అప్పగింత

చేర్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న దర్శనార్థం గతనెల 20వ తేదీన వచ్చిన భక్తుడు బాల్నె అరుణ్ కుమార్ సెల్‌ఫోన్ అకస్మాత్తుగా హుండీలో పడిపోయింది. శుక్రవారం ఆలయంలో చేపట్టిన హుండీ లెక్కింపులో లభ్యమవడంతో సదరు సెల్‌ఫోన్‌ను ఆలయాధికారులు అరుణ్‌కుమార్‌కు అప్పగించారు.

కేంద్ర సెన్సార్ బోర్డ్‌మెంబర్‌గా ఉపేందర్ గుప్తా

మద్దూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబర్తికి చెందిన మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా కేంద్ర సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రం శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండు సంవత్సరాలపాటు ఈపదవిలో కొనసాగనున్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

మద్దూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి కిష్టయ్య డిమాండ్ చేశారు ఈ విషయమై శుక్రవారం మండలంలోని రేబర్తిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

క్రిస్మస్‌ను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ వేడుకలను సంప్రదాయబద్ధంగా జిల్లాలోని 4 శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ క్రిస్టియన్ సంఘాలకు సూచించారు. జిల్లాలో క్రిస్మస్ వేడుకల నిర్వహణపై శుక్రవారం ఐడీవోసీ సమావేశం మందిరంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్‌శాఖల అధికారులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... క్రిస్మస్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాలలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందని, ఈ వేడుకల నిర్వహణకు ప్రతీ నియోజకవర్గానికి రూ. 2 లక్షలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ అహ్మద్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట నారాయణ టెక్నో స్కూల్లో జోనల్ స్థాయి మాస్టర్ ఓరెటర్ కాంపిటీషన్స్ గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, టూటౌన్ సీఐ ఉపేందర్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయిూస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఎంపీడీవో, ఎంపీవోలకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

సిద్దిపేట రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయిూస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూనికి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి చలో హైదారాబాద్‌కు అనుమతి ఇవ్వాలని శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు నాలుగుగైదు నెలల వేతనాలు రాకపోవడంతో పస్తులుండి పనులు చేస్తూ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల బకాయిలపై ఉన్నతాధికారులకు అనేకమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న చలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే కార్యాక్రమానికి గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు, కారోబార్, బిల్ కలెక్టర్, స్వీపర్, పంప్ ఆపరేటర్, ఎలక్ట్రీషన్, అటెండర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజలింగం, మల్లయ్య, నర్సయ్య, బుదవ్వ తదితరులు పాల్గొన్నారు

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

నంగునూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని మండలంలోని అక్కెనపల్లి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మాట్లాడారు.. పది సంవత్సరాలుగా ఆదర్శ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గట్లమల్యాల ఆదర్శ పాఠశాల సిబ్బంది ఏ. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, సీహెచ్. రజిని తదితరులు పాల్గొన్నారు.

సమానపనికి.. సమాన వేతనం ఇవ్వాలి

- టీపీటీఎఫ్ జిల్లాశాఖ డిమాండ్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 18 ఏళ్లుగా సమగ్రశిక్షాలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి సమానపనికి సమానవేతనం ఇవ్వాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజయేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులకు శుక్రవారం టీపీటీఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రతా కల్పించాలని, మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పొన్నమల్ల సత్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని ఎమ్మార్సీ కేంద్రం



తాళం వేసి ఉన్న ఎమ్మార్సీ కార్యాలయం

కొండపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో ఎమ్మార్సీ భవనానికి ఎవరూ హాజరుకావడం లేదు. ఉపాధ్యాయుల నిర్వహణ తీరును చూసే ఎమ్మార్సీ కార్యాలయం శుక్రవారం తెరుచుకోలేదు. కార్యాలయంలో పని చేసే వారంతా సమగ్ర శిక్షా ఉద్యోగులు కావడంతో కార్యాలయం మూతపడింది.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎమ్‌ఎస్‌ఐ ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా అధ్వర్యంలో రోడ్డు భద్రత పట్ల అవగాహన ప్రచారం చేపట్టారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం, సహస్ర స్కూలు విద్యార్థులకు, సిబ్బందికి, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై క్విజ్ పోటీలు, హెల్మెట్ అవగాహన సెషన్ ఏర్పాటు చేశారు. డిజిటల్ రోడ్డుసేఫ్టీ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ ఈ గురుకుల్ ద్వారా మూడు రకాల వయసుల వారికి మూడు మాడ్యుల్స్‌లో శిక్షణ అందిస్తున్నట్లు హెచ్‌ఎమ్‌ఎస్‌ఐ ప్రతినిధులు తెలిపారు.

- గజ్వేల్ రూరల్: రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు ప్రయాణికులు కృషి చేయాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా సూచించారు. కొల్గూర్ గ్రామంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు అయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శుక్రవారం గ్రామాన్ని సందర్శించి గ్రామ శివారు వద్ద ప్రమాద సూచిక రేడియం బోర్డును ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు 10,422




మద్దూరులో వివరాలు సేకరిస్తున్న సెక్రెటరీ

మద్దూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి కుటుంబాలను సందర్శించి వివరాలు సేకరిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ తెలిపారు. ఎంపీడీవో శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఉమ్మడి మండలంలోని 23 గ్రామాల్లో 10,422 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే చేపట్టినట్లు తెలిపారు. సర్వేకు వచ్చిన సెక్రటరీలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాలన వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఇళ్లు ఉందా, ఉంటే ఎవరి పేరున ఉంది. లేకుంటే ఖాళీ స్థలం ఉందా లేదా, రేషన్ కార్డు ఉందా లేదా వంటి వివరాలు అడిగి తెలుసుకుని ఫొటోలు తీసుకుని వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో ఎంట్రీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు 196 మంది ఇళ్లను సర్వే చేసి యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- తొగుట సీఐ లతీఫ్



దౌల్తాబాద్: సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లతీఫ్

రాయపోల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ద్వారా నేరాలను నియంత్రించవచ్చని తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. మండలంలోని అనాజీపూర్ శివారులోని పెద్దమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దేవయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు నీల స్వామి, ఉపాధ్యక్షుడు జోడు కరుణాకర్, ఆలయ కమిటీ, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

- దౌల్తాబాద్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గౌరారంలో అయ్యప్ప పడిపూజ

వర్గల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారంలో తత్వమసి సేవా సమాజం ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరైయ్యారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు మఠం చంద్రయ్య, భూపాల్‌రెడ్డి, పూదరి రాజు, కరుణాకర్‌గౌడ్, మహేశ్‌గౌడ్, సుచిత్రరెడ్డి, గణేశ్‌గౌడ్, తిరుపతిగౌడ్‌తో పాటు ఇతర ప్రాంతల నుంచి వచ్చిన స్వాములు, గ్రామస్థులు ఉన్నారు.

మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

చేర్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం కానుకలు, ఒడిబియ్యం హుండీలు లెక్కింపులు చేపట్టారు. సిద్దిపేట వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో విశ్వనాథ్‌శర్మ పర్యవేక్షణలో మల్లన్న ఆలయ ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో హుండీ లెక్కించారు. ఈసందర్భంగా రూ.81,68,044నగదు, 146గ్రాముల బంగారం, 5.200కిలోల మిశ్రమవెండి, 26విదేశీ కరెన్సీనోట్లు, 5.50క్వింటాళ్ల ఒడిబియ్యం లభ్యమైనట్లు ఈవో తెలిపారు.

రైతులేమైనా ఉగ్రవాదులా?

- మండిపడ్డ నాయకులు



సిద్దిపేట టౌన్: మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేట టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న లగచర్ల రైతును ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో చేతులకు బేడీలు వేయడం దారుణమని, రైతులేమైనా ఉగ్రవాదులా అని రైతుబంధు సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందన్నారు. తన భూమిని ఫార్మాసిటీకి ఇవ్వకుండా కాపాడుకునే ప్రయత్నం చేసిన ఒక గిరిజన రైతుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఆయనవెంట నాయకులు ప్రభాకర్‌వర్మ, మోహన్‌రెడ్డి, జనార్ధన్, ఐలయ్య, నాగేందర్, కిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- దుబ్బాక: రైతు హీర్యానాయక్ పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణమని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు సంపంగి ఆశోక్ అన్నారు. దుబ్బాకలో బీజేపీ కిసాన్‌మోర్చా, బీజేపీ బీసీసెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులు, బీసీల పట్ల సర్కారు వివక్ష చూపుతందని, దేశంలో రైతు జపం చేసే రాహుల్‌గాంధీ దీనికి సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, పెంటం కిషన్, ప్రవీణ్, రమేష్‌రెడ్డి, గాజులబాస్కర్, పల్లె నేహాల్ తదితరులున్నారు.

ఫుడ్‌పాయిజన్‌లు జరగకుండా దృష్టి పెట్టాలి

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్



మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న నాయకులు

అక్కన్నపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఇటీవల ఫుడ్‌పాయిజన్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, మరోసారి ఇలాంటివి జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ కోరారు. మండలంలోని గోవర్ధనగిరి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచినప్పటికీ ఇంకా మెనూ పాటించడం లేదని ఆరోపించారు. ఆయనవెంట ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఉన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బత్తుల శంకర్‌బాబు

హుస్నాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హుస్నాబాద్ పట్టణంలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయకుండానే లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని కోరారు. ఆయనవెంట బీజేపీ నాయకులు రాంప్రసాద్, నరేష్, అనంతస్వామి, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


ఆలయ నిర్మాణానికి గ్రానైట్ అందజేసిన ఎమ్మెల్యే

- హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు, కమిటీ సభ్యులు

సిద్దిపేట రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విలువైన గ్రానైట్‌ను అందించిన ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామస్థులు, బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మిస్తున్న మహంకాళి అమ్మవారి ఆలయానికి సహాయం అందించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆలయ కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం, పార్టీ నాయకులు కోరడంతో వెంటనే స్పదించి రూ.2 లక్షల విలువగల గ్రానెట్‌ను అందించారని తెలిపారు. పార్టీ గ్రామ నాయకులు ఆలయం వద్దకు వెళ్లి రెడ్డి సంఘం నాయకులకు, ఆలయ కమిటీకి గ్రానెట్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పంగ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఆలయ కమిటి సభ్యులు రాజేశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వారం శ్రీనివాస్ రెడ్డి, గుర్రం సర్పిరెడ్డి, మల్లయ్య, గుర్రం రాంరెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి, అరుట్ల వెంకటేశ్వర్లు, కోడాడి శేఖర్, రాజిరెడ్డి ఉన్నారు.

ఆలోచన విధానమే భవిష్యత్తును నిర్ణయిస్తుంది

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



బెజ్జంకి: విజేతలతో ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకునే ఆలోచన విధానమే వారి ఉజ్వల భవిష్యత్తును నిర్ణయిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దాచారంలో ఆరు లక్షల ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, ఐదు లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన వంటగది నిర్మాణానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, స్థానిక నాయకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో తసహీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఎంఈవో మహతిలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

- రాయపోల్: రాయపోల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ క్రీడలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ బాబూనాయక్, తహసీల్దార్ దివ్య, ఎంఈవో సత్యనారాయణరెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.
- కొండపాక: మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో కొండపాక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖోలో రెండో బహుమతి సాధించినట్లు ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల, కమిటీ చైర్మన్ ఎం.భూలక్ష్మి రమేష్ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు నాగపురి విద్యార్థులు



ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న నాగపురి జడ్పీఎస్ఎస్ విద్యార్థినులు

చేర్యాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడాపోటీల్లో భాగంగా ఇటీవల చేర్యాలలో నిర్వహించిన ఖోఖో విభాగంలో పాల్గొన్న నాగపురి జడ్పీఎస్ఎస్‌కు చెందిన బాలికలజట్టు మండల టాపర్‌గా నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు బాలికలకు ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ చేతులమీదుగా ట్రోఫీ అందజేశారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే పట్టణంలోని గాయత్రీ పాఠశాల విద్యార్థులు వాలీబాల్‌లో జిల్లాస్థాయికి ఎంపికయ్యారు.

ఈ నెల 16న సీఎం కప్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

వర్గల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేది నుంచి 21వ తేది వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీలకు సిద్దిపేట జిల్లా జట్టు ఎంపిక కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా బేస్‌బాల్ అధ్యక్షులు నిమ్మ రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. క్రీడాకారుల ఎంపిక గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరిస్ విద్యానికేతన్ హైస్కూల్‌లో జరుగుతుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 7981923779, 9848949152 నెంబర్లకు సంప్రదించగలరని తెలిపారు.

17న జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

సిద్దిపేట టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 30 వరకు జనగామ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి 50వ జూనియర్ కబడ్డీ పోటీలకు, ఈ నెల 17న సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టు కోసం ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌లు తెలిపారు. సిద్దిపేట పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎంపిక పోటీలను సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు బాలుర విభాగంలో 20 ఏళ్లలోపు, 70 కేజీల బరువు, బాలికల విభాగంలో 65 కేజీలలోపు ఉండాలన్నారు. ఎంపిక పోటీలకు ఆధార్‌కార్డు, బోనాఫైడ్, పదోతరగతి మెమోతో హాజరుకావాలని చెప్పారు. పూర్తి వివరాలకు 9550847409, 99599 33472 నంబర్లను సంప్రదించాలని కోరారు.

19న ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సీఎం కప్ బాక్సింగ్..

కొండపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీల్లో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా బాక్సింగ్ క్రీడా పోటీలను ఈ నెల 19న కొండపాక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణ, భాస్కర్‌రెడ్డి తెలిపారు. సబ్ జూనియర్ బాలురు, బాలికలు, జూనియర్ బాలురు, బాలికలు, ఎలైట్ మెన్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు జిరాక్స్ కాపీలను ఈ నెల 19న కొండపాక బాలుడు ఉన్నత పాఠశాలలో సమర్పించాలని తెలిపారు.